# సాక్షి నిర్మల్

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023






## మట్టి ఎడ్ల ప్రతిమల నిమజ్జనం

పొలాల అమావాస్య వేడుకల్లో భాగంగా మట్టి ఎడ్ల ప్రతిమలను చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. వేడుకల్లో రైతులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. IIIలో▸



## అభివృద్ధిలో ఉత్తమం

స్వచ్ఛత, పచ్చదనం, అభివృద్ధిలో ఉత్తమంగా నిలిచిన నచ్చన్ఎల్లాపూర్ గ్రామం స్వచ్ఛ సర్వేక్షణ్-2023 అవార్డుకు ఎంపికైంది. రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకుంది. IIIలో▸

## వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30.0 /23.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. జిల్లాలో పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### మట్టి ప్రతిమలనే నెలకొల్పాలి



మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న డీఆర్డీవో

**లోకేశ్వరం:** ప్రతీ గ్రామంలో మట్టి వినాయక ప్రతిమలనే నెలకొల్పి పర్యావరణాన్ని కాపాడాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీలో భాగంగా ఆయా గ్రామాల సర్పంచులు, రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం సభ్యులకు జిల్లాలో స్వయం సహాయక సంఘం సభ్యులు తయారు చేసిన మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మట్టి గణపతుల ప్రతిమలను రాగి, మర్రి, మేడి తదితర విత్తనాలతో తయారు చేయించామని తెలిపారు. వీటిని నిమజ్జనం చేస్తే ప్రతిమల్లోని విత్తనాలు మొలకెత్తుతాయని పేర్కొన్నారు. ఒక్కో మట్టిగణపతి ప్రతిమను రూ.100కు సంఘం సభ్యులు విక్రయిస్తున్నారని తెలిపారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అనిత, ఏపీఎం మల్లేశ్ ఉన్నారు.

### ఝరి(బీ) గ్రామాన్ని సందర్శించిన అటవీ అధికారి

**తానూరు:** మండలంలోని ఝరి(బీ) శివారు ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న అటవీశాఖ బీట్ అధికారి మహేశ్ శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. అటవీ ప్రాంతంలో మేకలను చంపి తిన్న స్థలాన్ని పరిశీలించారు. ఆనవాళ్లు సేకరించారు. అటవీ ప్రాంతంలో వ్యవసాయ పొలాలున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సేకరించిన వివరాలను సంబంధిత అధికారులకు నివేదిస్తామని తెలిపారు.

### అడెల్లి ఆలయంలో వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

**సారంగపూర్:** అడెల్లి ఆలయ ప్రాంగణంలో తైబజారు వసూలు చేసుకునే హక్కునకు శుక్రవారం ఆలయ ఈవో రవికిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. అడెల్లి గ్రామానికి చెందిన గంగాధర్ గతేడాదికన్నా హెచ్చు పాడి వేలం దక్కించుకున్నారు. గతేడాది తైబజారు వసూలుకు ఆలయానికి రూ.4.05లక్షలు సమకూరగా ఈసారి రూ.4.08లక్షలు వచ్చింది. ఆదిలాబాద్ డివిజన్ దేవాదాయశాఖ పరిశీలకుడు రాజమొగిలి, వీడీసీ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ అర్చక బృందం సభ్యులు, సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

### గొర్రెల యూనిట్ల పంపిణీ



గొర్రెలతో గంగాధరయ్య, లబ్ధిదారులు

**కుంటాల:** మండలంలోని విఠాపూర్, సూర్యాపూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు సబ్సిడీ గొర్రెల యూనిట్లను జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి గంగాధరయ్య శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తున్న గొర్రెలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో 7,502 యూనిట్లకు 469 యూనిట్లు పంపిణీ చేశామని తెలిపారు. త్వరలో మిగతా యూనిట్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. వానాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు గల్లాపురం లక్ష్మి-రమేశ్, బక్కి సునీత-భోజన్న, పశువైద్యాధికారి ప్రకాశ్, ఉప సర్పంచులు ఆయిటి రాజన్న, నవీన్‌రెడ్డి, సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం

**నిర్మల్ రూరల్:** భాష అభ్యసన అభివృద్ధి వేదిక జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా కన్వీనర్ కొండూరు పోతన్న ఓ ప్రకటన విడుదల చేశారు. గౌరవ సలహాదారుగా మల్యాగౌడ్, రాష్ట్ర ప్రతినిధిగా నాగయ్య కురుమే, జిల్లా కో కన్వీనర్లుగా రవిబాబు, గంగాధర్‌రావు, గంగుల చిన్నన్న, దాసరి సాయన్న, మహిళా కన్వీనర్‌గా వాణిశ్రీ, మహిళా కో కన్వీనర్లుగా రజితారాణి, గంగారాణి, పుష్ప, శివరాణిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. మాతృభాషను సంరక్షించుకునే మహోన్నత లక్ష్యంతో ఈ వేదికను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు తరగతి గదిలో అభ్యసన కృత్యాలతో బోధించడం సంఘం ముఖ్య లక్ష్యమని వివరించారు.

# వైద్య విద్యార్థులకు.. బంగారు బాట

- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు
- నిర్మల్ వైద్యకళాశాల ప్రారంభం
- మంత్రి హరీశ్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించిన సీఎం
- జిల్లాకు పండుగరోజు: మంత్రి అల్లోల
- యువత చెంతకే వైద్యవిద్య: కలెక్టర్
- నిర్మల్‌లో పండుగ వాతావరణం



మంత్రి ఐకేరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న విద్యార్థులు, చిత్రంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్

**నిర్మల్‌చైన్‌గేట్:** తెలంగాణ అంతటా మెడికల్ కళాశాలల ఏర్పాటుతో వైద్య విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాట పడిందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్యకళాశాలతోపాటు రాష్ట్రంలో మరో ఎనిమిది కళాశాలలను సీఎం కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం వర్చువల్ విధానంలో ఒకేసారి ప్రారంభించారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో 26 మెడికల్ కాలేజీలున్నాయని.. భవిష్యత్‌లో మరో ఎనిమిదింటిని ప్రారంభిస్తామని చెప్పారు. తెలంగాణ ఏటా 10వేల మంది వైద్యులను దేశానికి అందించబోతోందని తెలిపారు. లక్ష జనాభాకో 22 మెడికల్ సీట్లు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. 500 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం రాష్ట్రానికి ఉందని, రాష్ట్రంలో 10 వేల సూపర్ స్పెషాలిటీ బెడ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పేద గర్భిణులకు కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు ఇస్తున్నామని, గర్భిణులకు ఇబ్బంది లేకుండా అమ్మఒడి వాహనాలు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు చేపట్టామని, ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే 76 శాతం ప్రసవాలు జరుగుతున్నాయని తెలిపారు.

### వైద్యరంగంలో అరుదైన ఘట్టం

జిల్లా వైద్యరంగంలో మెడికల్ కళాశాల ఏర్పాటు అరుదైన ఘట్టమని స్థానిక మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ వర్చువల్‌గా వైద్యకళాశాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ చొరవతో నిర్మల్ జిల్లా కేంద్రంగా ఏర్పడిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కేసీఆర్ చేతుల మీదుగానే నిర్మల్‌లో మెడికల్ కాలేజీ ప్రారంభం కావడం సంతోషంగా ఉందని చెప్పారు. పేదలకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువైందని తెలిపారు. నిర్మల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుపై సీఎం కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి పెట్టారని కొనియాడారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు.

### పేదలకు కార్పొరేట్ స్థాయి సేవలు

జిల్లాలో మెడికల్ కాలేజీ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని, ఇక పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా యువత వైద్యవిద్య కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పని లేదని తెలిపారు.

### జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ



ర్యాలీలో మంత్రి, కలెక్టర్, అధికారులు

**నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలో నూతన మెడికల్ కళాశాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైద్యారోగ్యశాఖ శకటం ముందు నడవగా రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్, నాయకులు అల్లోల గౌతమ్ రెడ్డి, పాకాల రాంచందర్, అల్లోల మురళీధర్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, రామ్‌కిషన్‌రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, రాము, లక్ష్మణాచారి, విద్యార్థులు, ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు, వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ పండుగ వాతావరణంలో మంచిర్యాల చౌరస్తా మీదుగా దివ్యాగార్డెన్స్ వరకు కొనసాగింది. దారి పొడవునా డీజే పాటలతో విద్యార్థులు, యువకులు నృత్యాలు చేశారు. పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కాగా, ర్యాలీ సందర్భంగా మంత్రి ఐకేరెడ్డి నృత్యం చేస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం దివ్యాగార్డెన్స్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి



వర్చువల్‌గా మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

### సంతోషంగా ఉంది



మా నాన్న జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో ఫార్మసిస్ట్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. డాక్టర్ చదవాలనే నా లక్ష్యానికి అంకురార్పణ ఇక్కడే జరిగింది. సొంత జిల్లాలోనే నాకు సీటు రావడం సంతోషంగా ఉంది. ఈ జిల్లా బిడ్డగా బాగా చదివి మంచి డాక్టర్‌గా పేరు తెచ్చుకుంటా. కళాశాలకు మంచిపేరు తెస్తా.

– జారా నవాల్, నిర్మల్

### అమ్మ కల నిజం చేస్తా



డాక్టర్ కావాలని చిన్నప్పటి నుంచి కలగన్న. మా అమ్మ జిల్లా ఆస్పత్రిలో 20 ఏళ్లుగా స్టాఫ్‌నర్స్‌గా పని చేస్తున్నారు. అమ్మ నన్ను డాక్టర్‌ను చేయాలనే ఆశతో చదివించారు. అమ్మ కల నిజం చేసేరోజు వచ్చింది. సీటు సాధించేందుకు కష్టపడ్డా. సొంత జిల్లాలో చదివే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది.

– ఎస్.భానుతేజ, నిర్మల్

### నేను చదువుకోలేకపోయినా..



నేను ఆటో నడుపుతూ జీవనాన్ని కొనసాగిస్తున్న. నేను చదువులో అంతగా రాణించలేదు. నాలాగా నా కుమారుడు కావద్దని అతడిని కష్టపడి చదివించిన. ఇప్పుడు పక్క జిల్లాలోనే మెడికల్ కాలేజీలో సీటు రావడం సంతోషంగా ఉంది. నా కుమారుడు మంచి డాక్టర్ కావాలన్నదే నా కోరిక.

– విజయ్‌కుమార్, ఆదిలాబాద్, విద్యార్థి తండ్రి

### మంచి డాక్టర్‌గా ఎదుగుతా..



ఎంతో కష్టపడితేనే నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వచ్చింది. ఈరోజు నుంచి క్లాసులు ప్రారంభం కావడం.. నాన్నతో వచ్చి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. కష్టపడి చదివి మంచి డాక్టర్‌గా ఎదుగుతా.

– సమ్మిత్, ఆదిలాబాద్

### సైకియాట్రిస్ట్‌ను అవుతా



తెలంగాణలో మెడికల్ సీట్లు పెంచడం వల్లే నాకు అవకాశం వచ్చింది. నేను సైకియాట్రిస్ట్‌ను అవుతా. డాక్టర్ కోర్సు పూర్తిచేశాక పేదలకు సేవ చేస్తా. ఇక్కడి కళాశాలలో సేవలు సంతృప్తికరంగా ఉన్నాయి.

– నందిని, నిజామాబాద్

### అక్కలాగే కావాలని..



మా అక్కయ్య వికారాబాద్‌లో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. నేను కూడా మా అక్క లాగే డాక్టర్ కావాలనుకుని కష్టపడి చదివి సీటు సంపాదించాను. మన జిల్లాలోని మెడికల్ కాలేజీలో సీటు రావడం ఆనందంగా ఉంది.

– అడుముల్ల శశివర్ధన్, భైంసా

### చాలా దగ్గరగా ఉంది



గతంలో ఎంబీబీఎస్ చదవాలంటే ఇబ్బందిగా ఉండేది. కాలేజీ నాకు దగ్గరగా ఉంది. ఇక్కడకు వచ్చి వెళ్లడం చాలా సులభం. చదువు పూర్తిచేశాక పేదలకు సేవలందిస్తా. మా నాన్న వైద్యుడే. ఆయన ప్రోత్సాహంతో డాక్టర్ కావాలనుకుంటున్నా.

– మహిన్, ఆర్మూర్

# ప్రశాంతంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష



జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలోని పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి



కేంద్రానికి వస్తున్న అభ్యర్థులు



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

**నిర్మల్ రూరల్:** జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 32 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. పేపర్-1 ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. మొత్తం 7,611 మంది అభ్యర్థులకు 6,672 (87.66%) మంది హాజరు కాగా, 939 మంది గైర్హాజరయ్యారు. పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించారు. 4,586 మంది అభ్యర్థులకు 4,214 (91.89%) మంది హాజరు కాగా, 372 మంది గైర్హాజరయ్యారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. మంచిర్యాల, నిజామాబాద్, భైంసా, ఆదిలాబాద్ పట్టణాల నుంచి ప్రత్యేక బస్సులు కేటాయించగా అక్కడి విద్యార్థులు తరలివచ్చారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని వశిష్ఠ హైస్కూల్, గిరిజన ఆశ్రమ పాఠశాల, బాలురు, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను పరిశీలించారు.

## ‘దళితబంధు’ కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న సంఘం సభ్యులు

**లోకేశ్వరం:** దళితబంధు పథకం కోసం మండలంలోని పుస్పూర్ గ్రామ ఎస్సీ సంఘం సభ్యులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తమ గ్రామంలో ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేశారని అధికారులను ప్రశ్నించారు. లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించాలని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు ఆందోళన వద్దకు చేరుకుని ఎస్సీ సంఘం సభ్యులతో మాట్లాడారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దృష్టికి సమస్య తీసుకువెళ్లి అర్హులందరికీ దళితబంధు అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

## ‘బీసీ బంధు’ రాలేదని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మహిళలు

**కుభీర్:** తమకు బీసీ బంధు రాలేదని మండల కేంద్రానికి చెందిన వడ్డెర, మేదరి కులస్తులు శుక్రవారం స్థానిక వివేకానంద చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల 11మంది అనర్హులకు బీసీ బంధు మంజూరు చేశారని ఆరోపించారు. తమకు అన్ని అర్హతలున్నా డబుల్‌బెడ్రూం ఇళ్లు కూడా ఇవ్వలేదని వాపోయారు. రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఆందోళన వద్దకు చేరుకుని నచ్చజెప్పినా వినలేదు. ఎంపీడీవో, తహసీల్దార్ వచ్చి తమకు హామీ ఇస్తేనే విరమిస్తామని భీష్మించారు. వారు అందుబాటులో లేరని, ఎమ్మెల్యే వద్దకు తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు చెప్పడంతో శాంతించారు. అంతకుముందు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట కూర్చుని నిరసన తెలిపారు. సర్పంచ్ భర్త విజయ్‌ని నిలదీశారు. ఆయన తహసీల్దార్‌కు విషయం తెలిపారు. కాగా, వచ్చే విడతలో అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు విజయ్ తెలిపారు.

### 22న జెడ్పీ సర్వసభ్య సమావేశం

**నిర్మల్ రూరల్:** ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని దివ్యాగార్డెన్స్‌లో జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో సుధీర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

### ఎమ్మెల్యేను కలిసిన ముస్లింలు



ముస్లింలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**కడెం:** మండల కేంద్రంలోని చర్చి భూకబ్జాపై విషయమై ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ శుక్రవారం తహసీల్దార్ రాజేశ్వరిని కలిశారు. భూకబ్జాపై చర్చించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యేను మండల కేంద్రానికి చెందిన ముస్లిం మహిళలు కలిశారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలని కోరారు. కాగా, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక పంపిణీ చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

### రథయాత్రకు ఘనస్వాగతం

**లక్ష్మణచాంద:** టీటీడీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి హనుమాన్ చాలీసా రథయాత్ర శుక్రవారం మండల కేంద్రానికి చేరుకుంది. సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు రథయాత్రకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ హనుమాన్ స్వామీజీ స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులకు స్వామీజీ ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. ప్రజలు దైవభక్తితో ఉంటే రానున్న విపత్తుల నుంచి కొంతమేరకైనా దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు.

### శాంతియుతంగా జరుపుకోవాలి

**ఖానాపూర్:** గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ మోహన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలోగల స్వామి మినీ ఫంక్షన్‌హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్సై ఆర్ శంకర్, నాయకులు వెంకటేశ్వర్లు, సురేశ్, శ్యాం, సతీశ్‌రావు, రాజన్న ఉన్నారు.

### ఐడీ కార్డుల పంపిణీ

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ఐటీ సెల్ సభ్యులకు శుక్రవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఐడీ కార్డులు పంపిణీ చేశారు. సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు అఖిల్, ఉపాధ్యక్షులు రిజ్వాన్‌ఖాన్, దశరథ్, సుధాకర్, శ్యామ్, వంశీ తదితరులున్నారు.

## క్లుప్తంగా

### గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీ

మంచిర్యాలటౌన్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లోని మంచిర్యాల, కొముంరంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో మిగిలిపోయిన స్వల్ప ఖాళీలను నింపేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ స్వరూపరాణి పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, బ్యాక్‌లాగ్ ఖాళీలైన 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన వాటికి ఈ నెల 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం గర్ల్స్ లక్సెట్టిపేట్‌లో బాలురు, బాలికలకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే వారు గురుకులాల సెట్‌లో ఎంపికై, వివిధ కారణాలతో పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకుని వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

### ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని వాల్మీకినగర్‌లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు బండారి విఠల్ ఇంట్లో చోరీ జరిగినట్లు వన్‌టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. వివరాల ప్రకారం.. సిర్పూర్(టి) మండలంలో పోస్టింగ్ ఉండడంతో సదరు ఉపాధ్యాయుడు ప్రతిరోజు జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో గురువారం ఇంటికి తాళం వేసిన వెళ్లిన ఆయన శుక్రవారం తిరిగి ఇంటికి చేరుకోగా తలుపు తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని బీరువా తెరిచి ఉండడంతో పాటు వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాలోని రూ.10వేల నగదు అపహరణకు గురైనట్లు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### రిటైర్డ్ ఏఎస్సై ఇంట్లో చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో రిటైర్డ్ ఏఎస్సై అశోక్‌రావ్ ఇంట్లో గురువారం చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీకి చెందిన సార్లోళ్ల గణేష్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు అశోక్‌రావు ఇంటికి తాళం వేసిన విషయాన్ని గమనించారు. తాళాన్ని పగులగొట్టి ఇంట్లో భద్ర పరిచి ఉన్న పదమూడున్నర తులాల బంగారంతో పాటు రూ.7వేలు ఎత్తుకెళ్లారు. కేఆర్కే కాలనీ సమీపంలోని బాలాజీనగర్ సమీపంలోపట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారంతో పాటు దొంగలించిన డబ్బులతో కొనుగోలు చేసిన సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

### గుడుంబా పట్టివేత



పట్టుబడిన వ్యక్తితో ఎక్సైజ్ ఎస్సై

దండేపల్లి: మండలంలోని మేదరిపేట వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై రాబర్ట్ తెలిపారు. లింగాపూర్‌కు చెందిన ప్రశాంత్ ఆటోలో గుడుంబాను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### వృద్ధుడి ఆత్మహత్య

మందమర్రిరూరల్: అనారోగ్యంతో వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... పట్టణంలోని రెండోజోన్‌లోని కటికె దుకాణాల ఏరి యాకు చెందిన బీరం నర్సయ్య(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# పండ్ల తోటల సాగుపై ఆసక్తి



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు సూర్యవంశీ రుక్మిణిబాయి, ఇచ్చోడ మండలంలోని కామాగిరికి చెందిన మహిళా రైతు. రెండెకరాల్లో పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకుంది. ఉపాధి, ఉద్యానవనశాఖ అధికారులు పంటపొలాన్ని పరిశీలించారు. 90శాతం సబ్సిడీపై ఈ రైతుకు డ్రిఫ్‌తో పాటు పండ్ల మొక్కలు, సాగుకు అవసరమయ్యే వాటిని త్వరలో అందించనున్నారు. జిల్లాలో ఇలాంటి రైతులు 1387 మంది పండ్ల తోటల సాగుకు సిద్ధంగా ఉన్నారు.



కామాగిరిలో పండ్లతోటల సాగు సర్వే చేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది (ఫైల్)

- సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు
- సర్వంసిద్ధం చేస్తున్న ఉపాధి, ఉద్యానవన శాఖలు

| జిల్లాలో పండ్ల తోటల సాగు వివరాలు.. | లబ్ధిదారుల సంఖ్య : | సాగు ఎకరాల్లో : | మండలాలు : |
| --- | --- | --- | --- |
| | 957 | 1387 | 18 |

ఇచ్చోడ: ప్రతియేటా వాతావరణంలో వస్తున్న మార్పులు, సాధారణ పంటల సాగుతో అన్నదాతలు కష్టాలు గట్టెకకపోవడంతో పండ్ల తోటల సాగువైపు జిల్లా రైతులు మొగ్గుచూపుతున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పండ్ల తోటల సాగు అవసరాలను గుర్తించిన ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉద్యానవన, పంచాయతీ రాజ్, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా చిన్న,సన్న కారు రైతులు రాయితీపై పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సహించడానికి ముందుకొచ్చింది. పత్తి, సోయా ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉద్యానవన శాఖ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది.

**సాగుకు భారీ రాయితీ...**

చిన్న, సన్న కారు రైతులకు పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం భారీగా రాయితీ ఇవ్వనుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ, ఇతర రైతులకు 90శాతం సబ్సిడీపై పండ్ల తోటల సాగుకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఉపాధి హామీ నిధుల నుంచి అందజేయనుంది. పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు ఈ డబ్బును జాబ్‌కార్డు ద్వారా నేరుగా రైతుకు అందే విధంగా ప్రణాళిక సిద్ధంచేసింది.

**ఉద్యానశాఖ ద్వారా...**

పండ్లతోటల సాగుకు ఉద్యానశాఖ ద్వారా పర్యవేక్షణ చేయనుంది. మొక్కల ఎంపిక మొదలు, పండ్ల ఉత్పత్తి దశ వరకు అన్ని అంశాల్లో ఉద్యానశాఖ మార్గదర్శకాల ద్వారా పండ్ల తోటల సాగుకు ఆ శాఖ రైతులను ప్రోత్సాహిస్తుంది. అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మామిడి, నిమ్మకాయ, నారింజ, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, సపోట, అల్లనేరడి, ఆపిల్ బెర్, దానిమ్మ, కొబ్బరి తోటల పెంపకం ద్వారా రైతులకు ఆర్థికంగా బలోపేతం కోసం సన్నాద్ధమవుతోంది.

### పండ్లతోటల సాగుతో లాభాలు



పండ్లతోటల సాగుతో రైతు మంచి లాభాలు పొందవచ్చు. జిల్లాలో పండ్ల తోటల సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. మొక్కలు నాటిన నుంచి నాలుగేళ్ల వరకూ మధ్యలో అంతర్ పంటలు కూడా సాగుచేసుకోవచ్చు. పండ్ల సాగుకు పెట్టుబడుల ఖర్చులను ప్రభుత్వం రాయితీ ద్వారా అందిస్తుంది.

– శ్రీనివాస్ రెడ్డి,
జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, ఆదిలాబాద్

## పొలాల అమావాస్య ఉత్సవాల్లో పీవో



గ్రామస్తులతో మాట్లాడుతున్న పీవో

నార్నూర్: గిరిజన గ్రామాల్లో నిర్వహించే పొలాల అమావాస్య ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మండలంలోని గుంజాల గ్రామంలో పాల్గొని సంప్రదాయ పూజలు చేశారు. పొలాల పండుగ నేపథ్యాన్ని ఆదివాసీ గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాల ను ఈ తరం వరకు పాటించి భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీవో భాస్కర్, జామ్‌డా రాయి సెంటర్ సార్‌మేడి మెస్రం దుర్గు, జామ్‌డా రాయి సెంటర్ సార్‌మే డి కొట్నాక్ కృష్ణా, సర్పంచ్ సావిత్రబాయి, గ్రామ పటేల్ కుమ్ర లక్ష్మణ్ ఉన్నారు.

### కుక్కల దాడిలో గొర్రెలు మృతి

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌కు చెందిన మెరుగు గురువయ్య గొర్రెల మందపై గురువారం అర్ధరాత్రి వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో తొమ్మిది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో సుమారుగా రూ.60వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

## గిరి గ్రామాల్లో జాగేయ్ మాతరి వేడుకలు



ఇంద్రవెల్లి - ప్రత్యేక పూజలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

ఇంద్రవెల్లి/సిరికొండ/:బోథ్: ఆదివాసీ గిరి గ్రామాల్లో శుక్రవారం జాగేయ్ మాతరి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొలాల అమావాస్య మరుసటి రోజు శుక్రవారం ఉదయం ఇంటికొకరి చొప్పున వెదురుకర్రలు పట్టుకుని ఇంటి పైకప్పులను కొడుతూ జాగేయ్ మాతరి అంటూ గ్రామ శివార్లకు వెళ్లారు. అక్కడ ఓ చెట్టు వద్ద వెదురుకర్రలు ఉంచి పూజలు చేసి నైవేద్యాన్ని దేవతలకు సమ ర్పించారు. చుట్టుపక్కల ఆయుర్వేద వనమూలికలు సేకరించి ఇంటికి చేరుకున్నారు. ఇందులో ఆదివాసీ ప్రధాన్ సమాజ్ గ్రామ పటేల్ గేడం జ్ఞానేశ్వర్, ఆదివాసీ ప్రధాన్ పురోహిత్ సేవా సంఘం మండలాధ్యక్షుడు గేడ భారత్, మహజన్ సోయం రాందాస్, మాడావి విశ్వనాథ్, కారోబారి కనక భీంరావ్ ఉన్నారు. అలాగే సిరికొండ మండలంలో కుంరం జంగుబాపు, మహజన్ కొరేంగ వాగు, కారోబారి కురం కోసేరావ్, కుంరం యాదవ్‌రావు ఉన్నారు.



సిరికొండ: భోజనం చేస్తున్న గిరిజనులు

## చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

- రూ.75వేల నగదు, బైక్ స్వాధీనం

నస్పూర్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను నస్పూర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ వివరాల ప్రకారం... పట్టణ పరిధిలోని ఫ్లడ్ కాలనీకి వెళ్లే దారిలోని ఓ హార్డ్‌వేర్ షాప్‌లో ఈ నెల 12న ఎండీ అసిఫ్ బేగ్, ముజీద్ అలీ నిజామాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇంటి నిర్మాణానికి సామాన్లు కావాలని వచ్చారు. షాపు యజమాని ఓ వ్యక్తికి షాపు వెనకాలకు వెళ్లి సామాన్లు చూపిస్తుండగా మరో వ్యక్తి షాపులోనే ఉన్నారు. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. యజమాని కౌంటర్‌లో చూడగా రూ.1.50 లక్షలు కనిపించలేదు. దీంతో అతడు 100కి డయల్ చేయగా సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. షాపు యజమాని బ్రహ్మచారి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఆధారంగా సీసీఎస్ పోలీసుల సహకారంతో నిందితులను శుక్రవారం పట్టణంలోని తోళ్లవాగు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. నిందితులపై 2007 నుంచి ఆర్మూర్, నిజామాబాద్, బిచ్కుంద, ఎల్లారెడ్డి, సిద్దిపేట పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులు నమోదయ్యాయి. వారి వద్ద నుంచి రూ.75వేల నగదు, బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, సీసీసీ నస్పూర్ ఎస్సై సంతోష్, కానిస్టేబుల్ సతీష్‌లను డీసీపీ రాంనాథ్‌కేకన్, ఏసీపీ తిరుపతి రెడ్డి అభినందించారు.

## ‘గ్రామ స్వరాజ్’తో సుపరిపాలన

- పల్లె పూర్తి సమాచారాన్ని తెలుసుకునే అవకాశం
- యాప్‌లో నిధులు.. ఖర్చులు తెలుసుకునే వీలు..




ఈగ్రామ స్వరాజ్ యాప్

నేరడిగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు వచ్చే నిధుల వివరాలు తెలుసుకునేందుకు వీలుగా గ్రామ స్వరాజ్ పేరుతో కేంద్రం యాప్ తీసుకువచ్చింది. ఇందులో పల్లెలకు వచ్చే నిధులు, జమ, ఖర్చులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రతి గ్రామ పౌరుడు తెలుసుకోవచ్చు. ప్రజలకు సుపరిపాలన అందించడానికి దోహదం చేస్తోంది. 2019లోనే అందుబాటులోకి తెచ్చినా.. గతేడాది నుంచే ఖర్చుల వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లాకు సంబంధించిన ఈ ఏడాది 2023–24కు వివరాలను పొందుపర్చారు.

**యాప్‌లో వివరాలు..**

గ్రామపంచాయతీకి సంబంధించిన అభివృద్ధి సమాచారం, ఆర్థిక పురోగతి, ఆస్తుల నిర్వహణ, జియో ట్యాగింగ్, నిధుల మంజూరు, వ్యయం, పనుల పురోగతి వంటి తదితర వివరాలను ఇందులో పొందుపర్చారు. ఆయా పంచాయతీల ప్రజాప్రతినిధుల కమిటీలు, సర్పంచ్, కార్యదర్శుల సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. వచ్చే ఏడాదికి సంబంధించిన అంచనా వ్యయాలు, అభివృద్ధి పనుల నివేదికలు ఇందులో కనిపిస్తాయి. పంచాయతీల పనులను భౌగోళిక వ్యవస్థ ద్వారా గుర్తిస్తున్నారు. ఒకసారి చేసిన పనులకు మరోసారి బడ్జెట్ కేటాయించడానికి వీలు లేకుండా ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు ఎన్ని పనులకు ఎంత ఖర్చు చేశారనే సమాచారం తెలుసుకోవచ్చు.

**ఎలా తెలుసుకోవచ్చు..**

ప్లేస్టోర్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందులో పేజీ ఓపెన్ చేయగానే ముందుగా రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం సమాచారాన్ని నమోదు చేసుకుంటే పేజీకి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. వీటిలోకి వెళ్లి పరిశీలిస్తే ఏయే పనికి ఎంత ఖర్చు చేశారో తెలుస్తుంది. ప్రణాళిక ప్రకారం చేయకుంటే పౌరులు, యువకులు సంబంధిత అధికారులను ప్రశ్నించే అవకాశం ఉంటుంది. యువత చైతన్యవంతమైతే పాలకవర్గాలు పొరపాట్లకు తావులేకుండా ప్రతి పైసాను లెక్క ప్రకారం చేసే అవకాశం ఉంటుంది.

| జిల్లా | పంచాయతీల సంఖ్య.. |
| --- | --- |
| ఆదిలాబాద్ : | 467 |
| నిర్మల్ : | 396 |
| మంచిర్యాల : | 311 |
| కుమురంభీం : | 334 |

### పాలనలో పారదర్శకత..



ఈ యాప్ ద్వారా పరిపాలనలో పారదర్శకత పెరుగుతుంది. గ్రామంలో చేపట్టిన, భవిష్యత్‌లో చేపట్టే పనుల వివరాలు, ఆదాయ, వ్యయాలను తెలుసుకోవచ్చు. వచ్చిన ప్రతి రూపాయికి సంబంధించిన అన్ని వివరాలను పొందుపరుస్తున్నారు. అవకతవకలు జరగడానికి ఆస్కారం ఉండదు.

– గాదె సమత, సర్పంచ్, వడూర్

### గతంలో అవకాశం లేదు..



మా గ్రామపంచాయతీకి సంబంధించిన అన్ని వివరాలను నేరుగా గ్రామస్వరాజ్ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఏర్పడింది. గతంలో వచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులు తెలుసుకునే వెసులుబాటు ఉండేది కాదు. ఈ యాప్ ద్వారా అన్ని అంశాలను తెలుసుకోవచ్చు.

అడిగం రాజు, సర్పంచ్, వాంకిడి

## ప్రాణం తీసిన మద్యం మత్తు



తిడికే అరవింద్ మృతదేహం



పెందూర్ జలైజాకు మృతదేహం

- బావిలో దూకి ఒకరు..
- పురుగుల మందు తాగి మరొకరు ఆత్మహత్య

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన అరవింద్ (25) గ్రామ పొలిమేరలోని బావిలో మద్యం మత్తులో దూకి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని చికిలి గ్రామానికి చెందిన తిడికే అరవింద్ ఏడాదిగా బంధువుల వద్ద మన్నూర్‌లో ఉంటున్నాడు. బంధువులైన దరాడే ఓం ప్రకాష్, గిత్తే వైభవ్‌లతో స్థానికంగా ఉన్న ఓ బావిలో ఈతకు వెళ్లారు. విషయం తెలుసుకున్న అరవింద్ అక్కడికి చేరుకుని ఈత కొడుతానని చెప్పాడు. బంధువులు వారించినా వినకుండా బావిలో దూకాడు. ఎంతకీ పైకిరాకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించగా ఈతగాళ్ల సాయంతో గాలించి మృతదేహాన్ని మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు.

**మద్యానికి బానిసై ఒకరు..**

యువకుడు మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఉమ్రి (బి) గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పెందూర్ జలైజాకు (20) ఏడాదిగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం సాయంత్రం అతిగా మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన జలైజాకు వారి చేనులో పురుగుల మందుతాగాడు. రాత్రి పందుల కాపలకు వెళ్లిన పక్క చేను యువకులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు.

### అంగన్‌వాడీ ఆయా ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్: కుటుంబ కలహాలతో అంగన్‌వాడీ ఆయా ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఏఎస్సై దిలీప్ వివరాల ప్రకారం... మండలంలోని ఉమ్రి కొలాంగూడకు చెందిన ఆత్రం రంభబాయి(30)అదే గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తోంది. భర్త సోనేరావు ఉన్నాడు. సంతానం కలగడం లేదనే తరుచుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం సైతం గొడవ కాగా మనస్తాపానికి గురై రంభబాయి పురుగుల మందుతాగాడు. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### ఉరేసుకుని వృద్ధుడు..

ఖానాపూర్: మండలంలోని పాత తర్లపాడ్ గ్రామంలో ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఆర్.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్కనపల్లి బుచ్చన్న(60) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తాగిన మైకంలో జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. బుచ్చన్నకు భార్య గంగవ్వ, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

### మనస్తాపంతో మరొకరు..

బెల్లంపల్లి: భార్యతో గొడవ తాళలేక భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం... రాజస్థాన్ రాష్ట్రంలోని బార్మర్ జిల్లా సంప గ్రామానికి చెందిన బాటి జోగ్‌సింగ్(35) బతుకుదెరువు కోసం తొమ్మిది నెలల క్రితం బెల్లంపల్లికి వలస వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ ఫ్లెవుడ్ షాపులో పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం జోగ్‌సింగ్ ఇంటికి వెళ్లాడు. భార్యతో తరుచుగా గొడవలు జరుగుతున్నాయని, తాను చనిపోతున్నట్లు బెంగుళూరులోని వరుసకు సోదరుడైన తనూసింగ్‌కు ఫోన్‌లో చెప్పాడు. దీంతో అతడు షాపు యజమానికి ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. వెంటనే షాపు యజమాని జోగ్‌సింగ్ అద్దెఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య



తోర్ తరుణ్(ఫైల్)

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గోవింద్‌పూర్ కాలనీకి చెందిన తోర్ తరుణ్(23) గురువారం రాత్రి మద్యం మైకంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేష్, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. తోర్ తరుణ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం అతిగా మద్యం తాగి తండ్రి సుభాష్‌తో గొడవ పడి దాడి చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మద్యం మత్తులో ఇంటి వెనకాలోని పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి తండ్రి తోర్ సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.